క్లుప్తంగా

దేశ ఆర్థిక పరిస్థితి మెరుగు

తుర్కయంజాల్: బీజేపీ 11 ఏళ్ల పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడి, ప్రపంచంలో 4వ స్థానానికి చేరుకుందని పార్లమెంట్ మాజీ సభ్యుడు బూర నర్సయ్య గౌడ్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్‌లు అన్నారు. మంగళవారం రాత్రి కొహెడలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సభలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు.. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, డబ్బు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఫామ్ హౌజ్ ఓనర్లు, వ్యాపారులను బెదిరించి కమీషన్లు దండుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నోముల దయానంద్ గౌడ్, బోసుపల్లి ప్రతాప్ రెడ్డి, బచ్చిగళ్ల రమేష్, నాయకులు కొత్త రాంరెడ్డి, కందాల బల్‌దేవ్ రెడ్డి, తూళ్ల నర్సింహ గౌడ్, కొంగ్రు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఇబ్రహీంపట్నం పోచమ్మ బస్తీ 11 కేవీ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ అఖిలేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోచమ్మ బస్తీ, పాత బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రి, తహసీల్దార్, నగర పంచాయతీ కార్యాలయాల పరిసరాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం



వెంకటేశ్‌తో నల్లవారిపల్లి నాయకులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామంలో నిర్మించే శ్రీ కంఠ మహేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సంపూర్ణ సహకారం అందిస్తుందని ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో బుధవారం నల్లవారిపల్లి, అవురుపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరగా.. ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, లాలయ్యగౌడ్, వెంకటనారాయణ, నారాయణగౌడ్, శ్రీను, శ్రీశైలం, సత్తయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగ ప్రభుత్వ భవనాల పరిశీలన



ప్రభుత్వ భవనాలను పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ శ్రీనివాస్

యాచారం: మండల పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను బుధవారం పంచాయతీ రాజ్ శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ డీఈఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపయోగంగా ఉన్న భవనాలను ఇతర అవసరాల కోసం వినియోగించుకునేందుకు పరిశీలన చేస్తున్నామని తెలిపారు. నందివనపర్తిలో ఏర్పాటు చేసే పీహెచ్‌సీని ఇక్కడ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని పేర్కొన్నారు. అందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలన చేస్తున్నామని వెల్లడించారు. ఈఈ భవనాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, రవీందర్‌గుప్తా ఉన్నారు.

ఇక్కడి రైతులకు దక్కని భరోసా!

ఇబ్రహీంపట్నం: ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఉందని ఇబ్రహీంపట్నం మండల రైతులకు రైతు భరోసాను ఆపటం సరైంది కాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.జగన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు అండగా నిలబడతామని ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రైతు భరోసా విషయంలో మోసం చేస్తుందని ఆరోపించారు. రబీ సీజన్‌లో మండల పరిధి కప్పపహాడ్ గ్రామ రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందిందని, ఈ ఖరీఫ్ సిజన్‌లో మండలంలోని ఏ ఒక్క రైతుకు భరోసా అందలేదన్నారు. సాగు చేసేవారందరూ రైతులు కాదా అని ప్రశ్నించారు. వెంటనే అర్హులందరికీ పెట్టుబడి సాయం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అన్నదాతకు 'భరోసా'



యాచారం రైతు వేదికలో భరోసాకు దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

- సాయం కోసం ఆతృత
- రైతు సదస్సుకు బారులు
- పెరుగుతున్న దరఖాస్తులు
- రేపటితో ముగియనున్న గడువు
- ఇబ్రహీంపట్నం డివిజన్‌లో రెండు వేలకు పైగా కొత్త రైతులు

యాచారం: రైతు భరోసాపై అన్నదాతల్లో ఆశలు పెరిగాయి. ఇంతకాలం సాయం వస్తుందో.. లేదోననే అనుమానంతో దరఖాస్తు చేసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సమాచారం ఇచ్చినా స్పందించలేదు. ప్రభుత్వం తాజాగా 'భరోసా' ఇస్తామని ప్రకటించడంతో పాటు.. తక్షణమే పలువురి ఖాతాల్లో ఎకరాకు రూ.6 వేల చొప్పున డబ్బులు జమ అయ్యాయి. దీంతో రైతు సదస్సులకు అన్నదాతలు బారులు తీరుతున్నారు. అర్జీకి ఈ నెల 20 ఆఖరు కావడంతో కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులు.. దరఖాస్తు చేసుకోవడానికి మండలాల్లోని వ్యవసాయ శాఖ కార్యాలయాలు, రైతు వేదికలకు పరుగు తీస్తున్నారు.

'ఫ్యూచర్' ఆశ..

ఫార్మాసిటీకి సేకరించిన భూమిలో ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీని నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. దీంతో ఈ ప్రాంతంలో వ్యవసాయ భూముల కొనుగోలుకు ప్రముఖులు ఆసక్తి చూపిస్తున్నారు. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండల పరిధి గ్రామాల్లో సాగు భూములు కొనేందుకు వ్యాపారులు, ఉద్యోగులు, రాజకీయ వేత్తలు, సినీ ప్రముఖులు, ఉన్నతాధికారులు సైతం ఆసక్తి చూపుతున్నారు. ఫ్యూచర్‌సిటీ ఏర్పాటైతే భవిష్యత్తులో ధరలు మరింత పెరుగుతాయనే భరోసాతో దొరికిన కాడికి కొనుగోలు చేస్తున్నారు. రైతులతో పాటు.. ఏడాది కాలంగా ఇక్కడ భూములు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్లు చేసుకున్న ప్రముఖులు సైతం భరోసాకు అర్జీ చేసుకుంటున్నారు.

ఎన్ని ఎకరాలున్నా..



నందివనపర్తిలో సాగు భూమి

ఏడాది కాలంగా పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన రైతులు రెండు వేలకు పైగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. కొత్త రైతులు యాచారం మండలంలో 515, మంచాల మండలంలో 500లకు పైగానే ఉన్నారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో వందల సంఖ్యలోనే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం పెట్టుబడి సాయం వస్తుందో రాదోనని, లేదా ఎకరాల లిమిట్ పెడతారోనని, ఐటీ దారులకు, ఉద్యోగులకు భరోసా ఇస్తారో.. లేదోననే ఆందోళన ఉండేది. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. స్వయంగా ఎన్ని ఎకరాలున్నా భరోసా ఇస్తామని, అంక్షలేమి లేవని భరోసా ఇవ్వడంతో దరఖాస్తు చేసుకునేందుకు రైతులు ముందుకు వస్తున్నారు.

ఎంతగానో ఉపయోగం



పట్టాదారు, పాసుపుస్తకం ఉంది. కానీ దరఖాస్తు చేసుకోలేదు. అధికారుల సమాచారం మేరకు రైతు భరోసాకు అర్జీ పెట్టుకుంటున్నాను. ఏడాదికి ఎకరాకు రూ.12 వేలు ఇస్తే పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడుతుంది. సర్వే నంబరు 89లో రెండు ఎకరాల 30 గుంటల భూమి ఉంది.

– బోయిని పెంటయ్య, రైతు, మొగుళ్లవంపు

ఆసక్తి పెరిగింది



రైతు భరోసాపై రైతుల్లో ఆశ, ఆశక్తి పెరిగింది. భరోసాకు నిబంధనలు లేవని ప్రభుత్వం ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఏడాది క్రితం మాల్, తమ్మలోనిగూడ, చింతపట్ల, నల్లవెల్లి రెవెన్యూ పరిధిలో భూములు కొనుగోలు చేసిన రైతులు సాగు సాయం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.

– రాంరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు

ఈ రోజే దరఖాస్తు చేసుకోండి



రైతు భరోసాకు అర్హులైన వారు గురువారం సాయంత్రం లోపే దరఖాస్తు చేసుకోవాలి. రైతులు ఇచ్చిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. డివిజన్‌లోని 1,800ల నుంచి రెండు వేల వరకు కొత్తగా పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన రైతులు ఉన్నారు. అన్నదాతలకు ఇది మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి.

– సుజాత, ఏడీఏ ఇబ్రహీంపట్నం డివిజన్

ఎన్నికల కోసమే సాగుసాయం

- అర్హులందరికీ భరోసా ఇవ్వాలి
- బీఆర్ఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆమనగల్లు: స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేస్తుందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం కొంతమందికి మాత్రమే రుణమాఫీ చేసి, మోసం చేసిందని ఆరోపించారు. గతంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసిందని, ఇప్పుడు స్థానిక ఎన్నికల కోసం మరోసారి చేసిందని తెలిపారు. ఈ సారైనా రైతులందరికీ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోసం చేస్తే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, నాయకులు పంతునాయక్, శ్రీనునాయక్, వస్పుల సాయిలు, రమేశ్‌నాయక్, వద్దె వెంకటేశ్, జగన్, సైదులుగౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు చింత.. ఉండలేము ఇంట



ఇంజాపూర్‌లో రోడ్డుపైనే పారుతున్న మురుగు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఓ వైపు 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ.. కాలనీల్లో సమస్యలు తీరడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోవడంతో పాటు, మురుగు కాల్వలు రోడ్డుపైనే ప్రవహిస్తున్న తీరు కళ్లకు కడుతుందని పేర్కొంటున్నారు. ఇందుకు నిదర్శనం.. ఇంజాపూర్‌లోని మిథాని కాలనీ, తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట తరచుగా డ్రైనేజీ రోడ్డుపై పరుగులు తీస్తుండటమే. మురుగుతో వాహనదారులు, దానిని నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేక ఇబ్బపడుతున్నామని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

మా భూములు తీసుకున్నారు..

- ఇక రైతు సదస్సులు ఎందుకు?
- సదస్సును అడ్డుకున్న ఫార్మా భూబాధిత రైతులు
- రికార్డులను తమ పేరిట మార్చాలంటూ డిమాండ్

యాచారం: 'గత ప్రభుత్వం ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వమంటూ బలవంతంగా రాత్రికి రాత్రే మా జాగలను టీజీఐఐసీ పేరిట మార్చింది. పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేసింది. రైతుల పేరిట మార్చాలని ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. మా భూములే తీసుకున్నాక.. ఇక రెవెన్యూ సదస్సులు ఎందుకు' అని ఫార్మా భూబాధిత రైతులు అధికారులను ప్రశ్నించారు. బుధవారం కుర్మిద్దలో నిర్వహించిన రైతు సదస్సును కొందరు రైతులు అడ్డుకున్నారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తూ.. టీజీఐఐసీ పేరిట ఉన్న రికార్డులను తమ పేరిట మార్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. రైతులకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం నేతల పి.అంజయ్య తదితరులు నిలిచారు. రైతులు ఆందోళనను తీవ్రతరం చేస్తుండడంతో గ్రీన్ ఫార్మాసిటీ సీఐ వారికి నచ్చజెప్పి శాంతింపజేశారు. అనంతరం తహసీల్దార్.. కొందరు రైతుల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు.



కుర్మిద్ద రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు



కార్మికుల పిల్లలను బడిలో చేర్పిస్తున్న ఎస్ఐ, ఉపాధ్యాయులు

పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

- అప్పుడే వారి జీవితాల్లో వెలుగు
- ఎస్ఐ వరప్రసాద్, ఉపాధ్యాయులు
- వలస కార్మికుల చిన్నారులకు ఎస్ఐ చేయూత

కడ్తాల్: 'బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి. వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి. అప్పుడే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయి' అని ఎస్ఐ వరప్రసాద్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు మండల కేంద్రానికి సమీపంలోని ఫౌల్ట్రీఫాం వద్దకు వెళ్లారు. వలస కార్మికుల పిల్లలను బడిలో చేర్పించాలని వారి తల్లిదండ్రులతో పాటు, ఫౌల్ట్రీ యజమానిని కోరారు. అక్కడి నుంచి పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేదని, సదుపాయం కల్పిస్తే బడికి పంపిస్తామని కార్మికులు అధికారులకు విన్నవించారు. దీంతో అక్కడే ఉన్న ఎస్ఐ.. ఒక ఆటోను ఏర్పాటు చేసి, మొదటి నెల రవాణా ఖర్చుకు రూ.4 వేలు అందజేశారు. తదుపరి నెల నుంచి ఆటో కిరాయి చెల్లించేందుకు ఫౌల్ట్రీ యజమాని శ్రీనివాస్ అంగీకరించారు. ఈ సందర్భంగా మొదటి నెల రవాణా ఖర్చులు చెల్లించిన ఎస్ఐతో పాటు, ఇక మీదట నెలనెలా చెల్లించేందుకు అంగీకరించిన ఫౌల్ట్రీ యాజమాని, ఉపాధ్యాయులు, ఎంఈఓ సత్యనారాయణకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు ఎస్ఎన్ మూర్తి, మల్లయ్యగౌడ్ ఉన్నారు.

టేకులపల్లి వంతెనకు మరమ్మతులు

కొందుర్గు: మండలంలోని టేకులపల్లి వంతెనకు బుధవారం తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. వర్షాల ఉధృతికి గత మూడేళ్ల క్రితం టేకులపల్లి వంతెన దెబ్బతిని ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, ఈ విషయమై స్థానికుల వినతి మేరకు నూతన వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మరమ్మతులు చేప డుతున్నామన్నారు.ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే నూతన వంతెన నిర్మిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, పైల్వాన్, అంజిరెడ్డి, రామచంద్రయ్య, శశిధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారుడికి ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని యూత్ కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు ఎలిగపల్లి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బాకారంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

దివ్యాంగుల సమస్యల పరిశీలన



దివ్యాంగులతో ఎస్ఆర్ఎల్ఎం బృందం, అధికారులు

ఇబ్రహీంపట్నం: ముకునూర్ గ్రామంలో మణిరత్నం విభిన్న ప్రతిభావంతుల సంఘం సభ్యులతో బుధవారం ఎస్ఆర్ఎల్ఎం బృందం సభ్యులు మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు, వాటి చెల్లింపుల విషయంపై ఆ సంఘం అధ్యక్షుడు జంగయ్య వివరించారు. ఎంతమందికి పింఛన్లు వస్తున్నాయని బృందం సభ్యులు వివరణ కోరగా.. 32 మందికి వస్తున్నాయని తెలిపారు. దివ్యాంగులకు పూర్తిస్థాయిలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. ఎస్ఆర్ఎల్ఎం మేనేజర్ ప్రకాశ్, సెర్ప్ అధికారిణి వసంత, డీఆర్‌డీఏ డీపీఎం స్వర్ణలత, ఏపీఎం రవీందర్, సీసీలు రమాదేవి, కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

కేశంపేట: కాకునూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో 1వ తరగతి విద్యార్థుల చేత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అక్షరాలు దిద్దించారు. తహసీల్దార్ గీత, హెచ్ఎం రాజవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు గీత ఉన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి చర్యలు

- ఎంఈఓ పురన్‌దాస్



చేవెళ్ల: కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ పురన్‌దాస్, ఉపాధ్యాయులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాధికారి పురన్‌దాస్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద పాఠశాలలో బడి బాటలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, బడి బయట ఉన్న కార్మికుల పిల్లలను బడిలో చేర్పించేందుకు కార్మికులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల కృషితో ప్రైవేట్ పాఠశాలల నుంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్న తల్లిదండ్రులను మాజీ సర్పంచ్ వెంకటేశంగుప్తాతో కలిసి ఎంఈఓ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దామరగిద్ద పాఠశాల దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి చెందటం సంతోషంగా ఉందన్నారు. తరగతి గదుల డిజిటలీకరణ పనులు, మరుగుదొడ్ల ఆధునీకరణ పనులను ఎంఈఓ పరిశీలించారు. అనంతరం గ్రామస్తుడు సీహెచ్ శంకర్ తన ముగ్గురు పిల్లలను ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ, మాజీ సర్పంచ్‌ల సమక్షంలో చేర్పించటంపై ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సంగీత, ఉపాధ్యాయులు బాలాజీ, అంజనేయులు, కిరణ్‌కుమార్, వసంత, సుమజ, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య: ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: సర్కార్ బడుల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ నుంచి పాఠశాలలో చేరిన 16 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమపిల్లలను సర్కార్ బడులకే పంపించాలని సూచించారు. విద్యే ప్రగతికి మూలాధారమని, అందుకు ప్రతి ఒక్కరూ చదువుకునేలా చూడాలన్నారు. నిరక్షరాస్యత నిర్మూలన, విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తమవంతు పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, మాజీ సర్పంచ్ ఈదుల కృష్ణగౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రావుల లక్ష్మి, గ్రామస్తులు వెంకటేశ్, ముక్తార్, ఆబేద్, యాదయ్య తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని విశ్వకర్మ మండల గౌరవ అధ్యక్షుడు నర్సింహాచారి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రేణుక ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

రాజీవ్ యువ వికాసం అందేనా?

రాజీవ్ యువ వికాసం పథకం రుణం కోసం యువత ఆశతో ఎదురు చూస్తోంది. ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందో స్పష్టత ఇవ్వడం లేదు. అసలు ఇస్తుందా లేదా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

- ఆశతో ఎదురు చూస్తున్న యువత
- నేటికీ స్పష్టత రాని వైనం



దరఖాస్తులు పరిశీలన చేస్తున్న ఎంపీడీఓ బాల శంకర్ (ఫైల్)

మంచాల: రాజీవ్ యువ వికాసం పథకం కింద ప్రభుత్వం ఏప్రిల్ నెలలో రుణాల కోసం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో మంచాల మండలంలో 2,528 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో .. 798 మందిని అర్హులుగా గుర్తించింది. కులాల వారీగా దరఖాస్తులు. అందులో జనాభా ప్రాతిప్రదికన ఎంత మంది అర్హులో వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీ జనాభా 7,459 మంది కాగా.. వారి నుంచి 614 దరఖాస్తులు వచ్చాయి. అందులో 205 మందిని అర్హులుగా పేర్కొన్నారు. ఎస్టీ జనాభా 10,433 మందికి 724 అర్జీలు అందాయి. 290 మందిని ఎంపిక చేశారు. బీసీ జనాభా (2011 సంవత్సరం) ప్రకారం 20,475 మందికి 1159 దరఖాస్తులు వచ్చాయి. వారిలో 261 మందికి రుణాలు ఇవ్వాల్సి ఉంది. మైనార్టీల నుంచి 73 అర్జీలు అందగా.. 14 మంది, ఈబీసీలు 28 మందిని అర్హులుగా గుర్తించారు. ఇలా మండలంలో మొత్తం 798 వికాసం కింద రుణాలకు అర్హులుగా సర్కారు గుర్తించింది.

రూ.4 లక్షల నుంచి 50 వేలకు

రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆశతో ఎదురు చూస్తున్నారు. పక్షం రోజుల క్రితం అప్పుడే రుణాలు మంజూరు చేసినట్లు అధికార యంత్రాంగం హడావుడి చేసింది. రుణాలు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఉన్నాయని, మొదటగా రూ.50 వేల లోపు వారికే రుణాలు వస్తాయని పేర్కొంది. దీంతో రూ.4 లక్షలకు అర్జీ పెట్టుకున్న వారు కాస్త.. తిరిగి రూ.50 వేలకు దరఖాస్తులు మార్చుకున్నారు. అయినప్పటికీ.. నేటికీ రుణాలు మంజూరు కాలేదు. ఇదే విషయంపై ఎంపీడీఓను ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

స్పష్టత లేదు



ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణాలు ఇచ్చి నిరుద్యోగ యువతను ఆదుకుంటామని చెప్పింది. ఆశతో వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. జనాభా ప్రాతిపదికన ఇవ్వటం సరికాదు. బ్యాంకు క్లియరెన్స్ ఇచ్చిన వారందరికీ రుణాలు అందజేయాలి.

– పున్నం రాము, ఆరుట్ల